# నకిలీ నోట్ల కేసులో మరో నిందితుడి అరెస్టు

**వివరాలు వెల్లడించిన ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు**

గాంధారి, జనవరి 29: ఉమ్మడి జిల్లాలో కలకలం రేపిన నకిలీ నోట్ల చెలామణీ కేసులో మరో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. సదాశివనగర్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నకిలీ నోట్ల కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ వెల్లడించారు. గాంధారి మండలంలోని చద్మల్ తండాలో సంక్రాంతి పండుగను పురస్కరించికొని జరిగిన జాతరలో కొందరు వ్యక్తులు నకిలీ నోట్లు చెలామణి చేశారు. దీనికి సంబంధించి బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసిన పోలీసులు తొమ్మిది మంది నిందితులను గుర్తించి, ఏడుగురు నిందితులను ఇప్పటికే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిర్మల్ జిల్లాకు చెందిన తిరుపతి అలియాస్ రాజుతోపాటు విజయవాడకు చెందిన జగన్ అలియాస్ రాము అనే వ్యక్తులు పరారీలో ఉన్నారని తెలిపారు. వీరిలో తిరుపతి అనే నిందితుడిని బుధవారం మంచిర్యాల జిల్లా అన్నారం గ్రామంలో అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. విజయవాడకు చెందిన మరో నిందితుడైన జగన్‌ను త్వరలోనే పట్టుకుంటామన్నారు. నకిలీ నోట్ల కేసులో నిందితులను పట్టుకున్న పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు. సదాశివనగర్ సీఐ సంతోష్‌గౌడ్, గాంధారి ఎస్సై ఆంజనేయులుతోపాటు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు

## ప్రత్యేకాధికారిగా బాధ్యతల స్వీకరణ


ప్రత్యేకాధికారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

బాన్సువాడ టౌన్, జనవరి 29 : బాన్సువాడ మున్సిపాలిటీ ప్రత్యేకాధికారిగా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారికి మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, సూపరింటెండెంట్ మల్లికార్జున్‌రెడ్డి, ఇతర సిబ్బంది స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీ సందర్శన


మాచారెడ్డిలో వైద్యుడి వద్ద వివరాలు తెలుసుకుంటున్న బృందం సభ్యులు

మాచారెడ్డి, జనవరి 29 : మండల కేంద్రంలో పీహెచ్‌సీని కేంద్ర బృందం సభ్యులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా దవాఖానలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, మందుల పంపిణీపై పీహెచ్‌సీ వైద్యుడు ఆదర్శ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాల్వంచలో ఉన్న పల్లె దవాఖానను సందర్శించారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు తంగు, ఏజే ఫ్రాన్సిస్ జావిర్, మాచారెడ్డి వైద్యబృందం ఉన్నారు.

## జిల్లా రగ్బీ జట్టు ఎంపిక


ఎంపికైన జిల్లా రగ్బీ జట్టు

కామారెడ్డి, జనవరి 29 : జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో బుధవారం (అండర్-15) జిల్లా స్థాయి బాలబాలికల రగ్బీ జట్ల ఎంపిక నిర్వహించారు. ఈ సెలక్షన్స్‌లో జిల్లాలోని వివిధ ప్రాంతాల పాఠశాలల నుంచి సుమారు 150 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారని జిల్లా రగ్బీ సెక్రటరీ నీలం రవి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఫిబ్రవరి 1, 2, 3వ తేదీల్లో మంచిర్యాల్ జిల్లాలో నిర్వహించనున్న రగ్బీ రాష్ట్ర టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ ఎంపికలో వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ అధ్యాపకులు బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

భిక్కనూరు, జనవరి 29 : విశ్వ విద్యాలయ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కో-ఆర్డినేషన్ కమిటీ మెంబర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సౌత్ క్యాంపస్ ప్రధాన ద్వారం నుంచి బీటీఎస్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బాయ్స్ హాస్టల్ వార్డెన్ యాలాద్రి, సునీత, వైశాలి, సరిత, నర్సయ్య, రమాదేవి, శ్రీకాంత్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు

బాన్సువాడ, జనవరి 29 : పట్టణంలోని సీపీఎస్ పాఠశాలలో ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదును జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు సంతోష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్టీయూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సంఘం పనిచేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో బాన్సువాడ మండల అధ్యక్షుడు పవార్ హీరాలాల్, ప్రధాన కార్యదర్శి పోతుగంటి వార్ హన్మాండ్లు, ఉపాధ్యక్షుడు రాథోడ్ సంజయ్, పండరి, కోశాధికారి శ్రీనివాస్ నాయక్, కార్యదర్శి నాగరాజు, విఠల్ యాదవ్ తదితరులు ఉన్నారు.


సభ్యత్వ నమోదు చేస్తున్న సభ్యులు

## పోక్సో కేసులో నేరస్తుడికి ఐదేండ్ల జైలు శిక్ష, జరిమానా

కామారెడ్డి, జనవరి 20 : పోక్సో కేసులో నేరస్తుడికి ఐదేండ్ల కఠిన కారాగార జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించినట్లు ఎస్పీ సింధూశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. దేవునిపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన పదేండ్ల బాలిక 2020 సెప్టెంబర్ 27వ తేదీన ఇంటి బయట ఆడుకుంటున్నది. కామారెడ్డి మండలం, రాజీవ్ గృహ కల్ప వడ్లూర్‌కు చెందిన షేక్ కరీం అలియాస్ కరిముల్లా ఆ బాలికపై లైంగిక దాడికి పాల్పడడంతో ఆమె ఏడుస్తూ తీవ్ర భయాందోళనకు గురైంది.
బీడీ కార్ఖానకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు జరిగిన విషయాన్ని చెప్పింది. అదే రోజు స్థానిక దేవునిపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు.
కేసు పూర్వపరాలు, సాక్ష్యాధారాలు, వైద్య నివేదికను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడిపై మోపిన నేరం రుజువు కావడంతో ఐదేండ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ కేసును సరైన పద్ధతిలో విచారణ చేసిన అప్పటి డీఎస్పీ లక్ష్మీనారాయణ, సోమనాథం, ఎస్సై జ్యోతి, పోలీసు తరపున వాదనలు వినిపించిన అదనపు ప్రాసిక్యూటర్ శేషు, కోర్టులో సాక్ష్యులను ప్రవేశపెట్టిన ప్రస్తుత కామారెడ్డి ఏఎస్పీ చైతన్యారెడ్డి, ప్రస్తుత ఎస్సై రాజు, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎస్సై మురళి, కోర్టు కానిస్టేబుల్ దేవి చంద్‌ను ఎస్పీ అభినందించారు.

## కబ్జాకు గురైన స్థల పరిశీలన


కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నాగిరెడ్డిపేట, జనవరి 29 : పోచారం గ్రామ శివారులోని ప్రాజెక్టు ప్రధాన కాలువ కబ్జాకు గురైన స్థలాన్ని నీటి పారుదల శాఖ ఈఈ మల్లేశం అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. కబ్జాకు గురైన కాలువ స్థలాన్ని గుర్తించారు సర్వేయర్ కరుణాకర్‌తో కొలతలు వేసి హద్దులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఈఈ వెంకటేశ్వర్లు మాట్లాడారు. పోచారం గ్రామానికి చెందిన ఆకిరెడ్డి గారి జగన్‌రెడ్డి, ఆకిరెడ్డిగారి కిషన్‌రెడ్డి పోచారం ప్రధాన కాలువను కబ్జా చేసి పంటలను సాగు చేస్తున్నాడనీ.. కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం నీటి పారుదలశాఖ ఈఈ మల్లేశం, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ నవాజ్, సర్వేయర్, పోలీస్ సిబ్బందితో కలిసి కబ్జా స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. వారి వెంట పోలీస్ సిబ్బంది గంగారాం, సురేశ్‌గౌడ్, నీటిపారుదల, రెవెన్యూ శాఖ సిబ్బంది ఉన్నారు.


మాజీ సీఎం కేసీఆర్ ఐదో సోదరి చీటి నర్సింగరావు తల్లి చీటి సకలమ్మ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బుధవారం నర్సింగరావు కుటుంబాన్ని మాజీ ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ హైదరాబాద్‌లో పరామర్శించారు.
– కామారెడ్డి, జనవరి 29

## క్రికెట్ పోటీల్లో ఎస్ఈ కార్యాలయ జట్టు ప్రతిభ


కప్‌ను అందజేస్తున్న ఎస్ఈ రాజశేఖర్

బాన్సువాడ రూరల్, జనవరి 29 : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నీటిపారుదల శాఖ కామారెడ్డి సీఈ (చీఫ్ ఇంజినీర్ ) కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో బాన్సువాడ ఎస్ఈ కార్యాలయ జట్టు మొదటి స్థానంలో నిలిచింది. బుధవారం కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జట్టుకు నీటిపారుదలశాఖ ఎస్ఈ రాజశేఖర్ అభినందిస్తూ కప్‌ను అందజేశారు. కార్యక్రమంలో క్రికెట్ జట్టు సభ్యులు అజీం, శ్రీనివాస్‌రెడ్డి, చిట్టంపల్లి రవి, శంకర్ భీం, సంజీవ్, ప్రదీప్, సాయి ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు టేబుళ్ల వితరణ

భిక్కనూరు, జనవరి 29 : మండలంలోని కాచాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.35 వేల విలువైన టేబుళ్లు వితరణ చేసి వాల్, ఎంట్రన్స్ గేట్ బోర్డు పెయింటింగ్ వేయించారు. ఉపాధ్యాయుల కోసం ఆరు కుర్చీలు, విద్యార్థులకు పూర్తి వివరాలతో కూడిన ఐడీ కార్డులను అందజేశారు. కార్యక్ర మంలో అమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు సంపత్, సభ్యులు శ్రీధర్, లింగం, రాజు, శ్రీకాంత్, ప్రేమ్‌రాజ్, శ్రీధర్, చంద్రశేఖర్, శ్రీరామ్, శేఖర్ పాల్గొన్నారు.

## అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

నాగిరెడ్డిపేట, జనవరి 29 : మండల కేంద్రానికి బీఆర్ఎస్ నాయకులు కిచ్చయగారి వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డిల మాతృమూర్తి శశిరేఖ(75) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే సురేందర్ గ్రామానికి చేరుకొని అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయనతో పాటు మండలంలోని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు అంత్యక్రియలకు హాజరయ్యారు.

## మున్సిపల్ అధికారులకు వినతి


మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సంఘ సభ్యులు

బాన్సువాడ టౌన్, జనవరి 29 : పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం ఆవరణలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని మున్సిపల్ సూపరింటెండెంట్ మల్లికార్జున్‌రెడ్డికి సంఘ సభ్యులు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## క్యాసంపల్లిలో న్యాయ చైతన్య సదస్సు


మాట్లాడుతున్న జిల్లా సేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి

కామారెడ్డి రూరల్, జనవరి 29 : మండలంలోని క్యాసంపల్లిలో ఉన్న వృద్ధాశ్రమాన్ని జిల్లా సేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి బుధవారం సందర్శించి న్యాయ చైతన్య సదస్సును నిర్వహించారు. సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. న్యాయ పరమైన చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ మోహన్‌రావు, అసిస్టెంట్ లీగల్ శ్రీనివాస్, డీఎల్ఎస్ఏ, ఎల్ఏడీసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు ప్రశాంతంగా చదువుకోవాలి

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 29 : పరీక్షల సమయం సమీపిస్తున్నందున విద్యార్థులు ప్రశాంతంగా చదువుకోవాలని ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు రజాక్ అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల ఉర్దూ మీడియం పదో తరగతికి చెందిన 20 మంది విద్యార్థులకు ఎంఐఎం పార్టీ తరపున ఆల్ ఇన్ వన్ పుస్తకాలను బుధవారం పంపిణీ చేశారు. మండల విద్యాధికారి వెంకటేశంతోపాటు మహ్మద్ ఖలీమోద్దీన్, మహ్మద్ షఫీ నిజామి, మహ్మద్ అజ్మలొద్దీన్ అబ్బాస్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులున్నారు.

## జింక మాంసం స్వాధీనం : ఒకరిపై కేసు నమోదు

రామారెడ్డి, జనవరి 29 : మండలంలోని కన్నాపూర్ తండా గ్రామంలో సోమవారం గూగులోత్ పరశురామ్ ఇంట్లో అటవీ శాఖ అధికారులు చుక్కల జింక మాంసం, కాళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సెక్షన్ ఆఫీసర్ జయశ్రీ బుధవారం తెలిపారు. సెక్షన్ ఆఫీసర్ జయశ్రీని వివరణ కోరగా పని భారంతో మీడియాకు వివరాలు వెల్లడించలేదని తెలిపారు.

## అర్హులకు రేషన్ కార్డులు అందజేయాలి

నస్రుల్లాబాద్, జనవరి 29 : అర్హులైన వారికి రేషన్ కార్డులు అందజేయాలని బీర్కూర్ తహసీల్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ లతకు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు సాయికిరణ్, కార్యదర్శి యోగేశ్, నాయకులు సాయి బాబా, వడ్ల బస్వరాజ్, గజేందర్, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్

లింగంపేట(తాడ్వాయి), జనవరి 29 : రైతుల సౌలభ్యం కోసం గ్రామంలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు బుధవారం ప్రారంభించారు. తాడ్వాయి మండలం ఎర్రపహాడ్‌లోని రైతు వేదిక వద్ద కంది కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దళారుల నుంచి రైతులను కాపాడడానికే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులు పొందాలని సూచించారు. ఆయన వెంట తాడ్వాయి సహకార సంఘం చైర్మన్ కపిల్‌రెడ్డితోపాటు సహకార సంఘ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంద కృష్ణ మాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం


మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కేక్‌ను కట్ చేస్తున్న నాయకులు

లింగంపేట, జనవరి 29 : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ మండల నాయకులు బుధవారం క్షీరాభిషేకం చేశారు. కేంద్ర ప్రభుత్వం మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ పురస్కారం అందించడంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గంగారాం, ద్యామని భూపతి, మన్నె బాలయ్య, రాజు, సంగమేశ్వర్, చందు, సాయన్న, గణేశ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## సబ్ కలెక్టర్‌కు వినతి


బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

బాన్సువాడ, జనవరి 29 : పట్టణంలోని గూడేం గల్లీకి చెందిన ఒట్లం గారి నాగవ్వకు చెందిన 787/2 సర్వే నంబర్‌లోని 12 గుంటల భూమిని ఇతరులు ఆక్రమించారని, తన భూమిని తనకు ఇప్పించాలని బాధితురాలు బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి బీజేపీ నాయకులతో కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. తన భర్త ఒట్లం గారి సాయిలు పేరున సర్వే నంబర్ 787/2లో 12 గుంటల భూమి ఉండేదని, తన భర్త 1995లో మృతి చెందాడని తెలిపింది. అనంతరం తన కుమారుడు ఒట్లం గారి గంగారాం పేరున పట్టా మార్పిడి జరిగిందని తెలిపింది. కొద్ది రోజులకు తన కుమారుడు, కోడలు కూడ చనిపోయారని, తనకు ఒక మనుమడు ఉన్నాడని, బతుకుదెరువు కోసం వేరే గ్రామానికి వెళ్లాడని వినతిలో పేర్కొంది. ఈ విషయంలో అధికారులు విచారణ చేపట్టి సర్వే చేయించి తన భూమిని తనకు ఇప్పించాలని వినతిలో పేర్కొంది. ఆమె వెంట బీజేపీ నాయకులు శ్రీనివాస్, గంగారెడ్డి, శంకర్‌గౌడ్, గంగాధర్‌లు ఉన్నారు.

## ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన ఉండాలి

కామారెడ్డి, జనవరి 29 : విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ రూల్స్, రోడ్ సేఫ్టీపై అవగాహన కలిగి ఉండాలని ఏఎస్పీ చైతన్యారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆర్కే డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు సేఫ్టీ, ట్రాఫిక్ రూల్స్‌పై పీపీటీ ద్వారా బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి, దేవునిపల్లి ఎస్సై రాజు, కళాశాల సీఈవో జైపాల్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**వాహనదారులు హెల్మెట్ ధరించాలి**

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆర్టీవో కార్యాలయంలో వాహనదారులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో జరుగుతున్న ప్రమాదాల్లో ఎక్కువ శాతం హెల్మెట్ లేకపోవడంతో మరణిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్పీ చైతన్యారెడ్డి

## 31న జిల్లాస్థాయి కబడ్డీ జట్ల ఎంపిక

కామారెడ్డి, జనవరి 29 : జిల్లా స్థాయి కబడ్డీ జట్ల ఎంపికలు ఈ నెల 31వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి రంగ వెంకటేశ్వర్ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలు జిల్లా కేంద్రంలోని లయోల ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారు ఫిబ్రవరి 4 నుంచి 7వ తేదీ వరకు ఆదిలాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి 71 వ సీనియర్ పురుషుల టోర్నమెంట్‌లో జిల్లా జట్టు తరపున పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారుల బరువు 85 కిలోల లోపు ఉండాల పేర్కొన్నారు. క్రీడాకారులు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బాణాల భాస్కర్‌రెడ్డికి రిపోర్ట్ చేయాలని, మరిన్ని వివరాలకు 9398571110కు సంప్రదించాలని సూచించారు.


తాడ్వాయి మండలం సంతాయపేట గ్రామంలోని భీమేశ్వర ఆలయంలో మాఘ అమావాస్య సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.
– లింగంపేట(తాడ్వాయి), జనవరి 29

## నీటిలో మునిగి ఒకరి మృతి


రావత్ శేఖర్

లింగంపేట(తాడ్వాయి), జనవరి 29 : తాడ్వాయి మండలం సంతాయిపేట గ్రామంలోని భీమేశ్వర వాగులో మునిగి రావత్ శేఖర్(16) మృతి చెందాడు. కొండాపూర్ తండాకు చెందిన రావత్ శేఖర్ బుధవారం మాఘ అమావాస్య సందర్భంగా భీమేశ్వర వాగులో స్నానం చేయడానికి బంధువులతో కలిసి వచ్చినట్లు స్థానికులు తెలిపారు. భీమేశ్వర వాగులో స్నానం చేసి ఆలయంలో దర్శనం చేసుకున్నట్లు తెలిపారు. దర్శనం చేసుకుని తిరిగి వెళ్తున్న క్రమంలో ఆదే గ్రామానికి చెందిన వారు ఈత కొట్టడానికి వాగులో దిగడంతో శేఖర్ తిరిగి నీటిలోకి దిగడంతో ప్రమాదవ శాత్తు నీటిలో మునిగి చనిపోయినట్లు తెలిపారు. శేఖర్ నీటిలో మునిగి పోయిన విషయాన్ని తోటి వారు చెప్పడంతో నీటిలో గాలించగా మృతదేహం లభించినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి శవాన్ని కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

## పిల్లలను బడిలో చేర్పించిన సీఆర్పీ

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 29 : బడిబయటి పిల్లలను గుర్తించిన సీఆర్పీ మహేశ్ వారిని మీసన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో చేర్పించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీసన్‌పల్లి ఇటుకబట్టీల వద్ద మూడు రోజుల క్రితం గుర్తించిన నలుగురు పిల్లలను బుధవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలోని ఐదో తరగతిలో ఇద్దరిని, మూడో తరగతిలో ఒక్కరిని, ఒకటో తరగతిలో ఒక్కరిని చేర్పించనుట్ల తెలిపారు. విద్యార్థుల వెంట వారి తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయుడు షాకీర్ తదితరులున్నారు.

## పాఠశాలల తనిఖీ

లింగంపేట, జనవరి 29 : మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోని బోనాల్, బోనాల్ తండాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల నిర్వహణ రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయులు ప్రతి నెల విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి విద్యార్థుల ప్రగతి, పాఠశాల అభివృద్ధిపై చర్చించాలని సూచించారు. ఆమె వెంట ప్రధానోపాధ్యాయులు శశికాంత్, రజనిప్రియ, ఉపాధ్యాయులు చంద్రప్రకాశ్, సంజీవ్, శైలజ, అమరేశ్వరీతోపాటు సీఆర్పీ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## దిష్టిబొమ్మల దహనం

పెద్ద కొడప్‌గల్, జనవరి 29 : కుంభమేళాపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అనుచిత వ్యాఖ్యలు సరికాదని, హిందూవుల మనోభావాలను కించపరిచారని హిందూ సంఘ సభ్యులు తెలిపారు. మండల కేంద్రంలోని గాంధీ చౌక్‌లో బుధవారం హిందూ సంఘం సభ్యులు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే దిష్ట బొమ్మను దహనం చేసి రోడ్డుపై నిరసన తెలిపారు. ఖర్గే రాజకీయ లబ్ధి కోసం సనాతన హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యానించారని హిందూ సంఘాలు ఆరోపించాయి. ఖర్గేపై వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో హిందూ సంఘం సభ్యులు వెంకటకృష్ణ పంతులు, తానాజీరావు తదితరులు పాల్గొన్నారు.


పెద్ద కొడప్‌గల్‌లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే దిష్ట బొమ్మను దహనం చేస్తున్న హిందూ సంఘం సభ్యులు


బీబీపేటలోని ప్రధాన చౌరస్తా వద్ద బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

### బీబీపేట్‌లో..

బీబీపేట్, జనవరి 29 : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు కేంద్రసహాయక మంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను బుధవారం దహనం చేసినట్లు కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు మహేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గద్దర్‌పై కేంద్ర సహాయక మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించిన అనంతరం దిష్టిబొమ్మను దహనం చేశామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేశ్, భిక్కనూర్ మార్కెంట్ కమిటీ చైర్మన్ పాతరాజు, కాంగ్రెస్ ఆయా గ్రామాల అధ్యక్షుడు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.